# అన్నయ్య ఆంత్రోపాలజీ

మూలం : కీ॥శే॥ ఎ.కె. రామానుజన్
తెలుగు : డా. దేవరాజ్ మహారాజు

పన్నెండు వచ్చేవి. వాటిలో ఉమ్మి, మలం, మూత్రం అతడికి చిన్నప్పటి నుండీ తెలుసు. చిన్నప్పుడు పెద్దవాళ్ళు చెబుతుండే వారు. టాయిలెట్‌కు వెళ్ళి వచ్చినపుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని! చేయి మట్టిలో రాసి రాసి శుభ్రంగా కడుక్కునేవారు. ఆ రోజుల్లో బావి పక్కన చేయి రుద్దిన గుర్తు ఎప్పుడూ ఉండేది.

నాదస్వరం నోటితో వాయించే వాయిద్యం. ఉమ్మి తగిలే వాయిద్యం. దక్షిణ భారతంలో వెనుకబడిన జాతులవారు, అంటరాని వారు మాత్రమే దాన్ని వాయిస్తారు. వీణ బ్రాహ్మణుల వాయిద్యం. మట్టికన్నా వెండి విలువైంది. నూలుకన్నా సిల్కు! ఈ పన్నెండు మలినాలు అందులో అంత సులభంగా ఇంకవు. సిల్కు పురుగుల నుండి తీసేది. కాని అదే విచిత్రం. మనిషికి మాత్రం పవిత్రమైంది!

అరె, ఈ అమెరికన్లు ఎక్కడెక్కడి విషయాలో రాబట్టారు. గ్రంథాలయాలు కొల్లగొట్టారు. కాశీ పండితుల మేధో సంపదనంతా పిండుకున్నారు. తాళపత్ర గ్రంథాలన్నీ వడబోశారు. ఆశ్చర్యం? మహా-ఆశ్చర్యం?

అతను తేరుకోలేక పోతున్నాడు.

అతనంటే - అన్నయ్య! అన్నయ్యే అతని పేరు..

నిజమే! ఎవరైనా భారతదేశం గురించి తెలుసుకోవాలనుకుంటే ఫిలడెల్ఫియా రావాలి. బర్కిలీ రావాలి. చికాగో రావాలి. అంతేగాని, అక్కడ భారత దేశంలో ఏముంది? నిజాయితీ ఏది? పట్టుదల ఏది? అసలు వివేకానందు డంతటి వాడు చికాగో వచ్చి, మతం మీద మహోపన్యాసం ఇవ్వలేదూ?

చితి నుండి వెలువడిన పొగ తాకినా బ్రాహ్మణుడు
స్నానం చెయ్యాలి. ఛండాలుడు మాత్రం శవాన్ని
కప్పిన గుడ్డల్ని తొడుక్కో వచ్చును (మనువు ( X.39)

గోమాంసం తినేవాళ్ళు నీచమైన జాతికి చెందినవారు. కాకులు, గ్రద్దలు అందువల్లనే పక్షుల్లో తక్కువ స్థాయికి చెందినవి. అవి చావుతో సంబంధం ఉన్నవి గనుక-బెంగాల్ లో 'తేలి' కులంలో రెండు శాఖలున్నాయి. అందులో నూనె అమ్మేవారిది అగ్రజాతి. నూనె గింజల్ని ఒత్తి నూనె తీసేవారిది నిమ్నజాతి. ఎందుకంటే వీరు గింజని చంపి, నూనె పిండుతున్నారు గనక! చావుతో సంబంధమున్న జాతి గనక!! (హట్టన్. 1946 : 77-78)


అన్నయ్యకి ఇవన్నీ తెలియవు. మైసూర్లో వునప్పుడు లైబ్రరికి తెగ తిరిగేవాడు. తిరిగి తిరిగి శాండిల్స్ అరిగి పొయ్యాయేగాని, ఇలాంటి విషయాలు ఎప్పుడూ చదవలేదు. లైబ్రరీలో పనిచేసేవాళ్ళు నలుగురైదుగురు అతడికి బాగా తెలుసు. అందులో శెట్టి మరీ చనువుగా ఉండేవాడు. తాళపు చెవుల గుత్తి ముందు పడేసి "తీస్కో అన్నయ్యా! నీకు ఇష్టం వచ్చిన పుస్తకం తీసుకో" అనేవాడు.

అది చాలా పెద్ద లావైన గుత్తి. ఇనుప తాళం చెవులు రోజూ చేతులు మారి మారి, అరిగి, నునుపై తెల్లబడి మెరుస్తూ ఉండేవి. మధ్యమధ్యలో చిన్న చిన్న ఇత్తడి తాళం చెవులు కొన్ని ఉండేవి. ఇత్తడి తాళాలకు ఇత్తడి తాళం చెవులు, పచ్చగా మెరుస్తూ ఉండేవి. ఆడ తాళాలకు మగ తాళం చెవులు, మగ తాళాలకు ఆడ తాళం చెవులు. పెద్ద తాళాలకు పెద్ద తాళం చెవులు, బుల్లి తాళాలకు బుల్లి తాళం చెవులు. ఒక్కోసారి పొడుగు తాళాలకు పొట్టి తాళం చెవులు, పొట్టి తాళాలకు పొడుగు తాళం చెవులు. ఎంత వైచిత్రి? మనువు చెప్పిన వైవాహిక సంబంధాల వలె ఎంత వైవిధ్యం? ఎన్ని వ్యత్యాసాలు? ఆ అద్దాలు అలమారాలలో ఎన్ని పుస్తకాలు? అందనివి, అందుకోలేనివి? విచిత్రమేమంటే విదేశాల కథలు, నగ్న చిత్రాలు ఎన్నో ఆ పుస్తకాలలో ఉండేవి. అప్పుడు తిరగేసినవన్నీ అవ్వే! ఆ వయసు అలాంటిది.

జ్ఞానం, నిష్ఠ, అగ్ని, ఆహారం, భూమి, మెదడు, జలం, ఆవుపేడ అలుకు, గాలి, త్యాగం, సూర్యుడు, కాలం, ఇవన్నీ సజీవుల పవిత్రతకు కారణాలవుతున్నాయి. (మనువు. V.105)



అసలు ఈ తెల్లవాడు ఇవన్నీ ఎలా తెలుసుకోగలిగాడు? ఈ అన్నయ్య అక్కడ పుట్టిన విత్తనం. శ్రోత్రీయుడు పదివేల మైళ్ళకు అవల ఆ గాలిని, ఆ నీటిని, ఆ భూమిని ఆ కాలాన్ని దాటి ఈ చికాగోలో వచ్చిపడి, చలికి వణుకుతూ ఇప్పుడిక్కడ మళ్ళీ వాటి గురించే నేర్చుకోవాల్సి వస్తోంది. మంచు మధ్యలో చలిలో కూర్చుని అక్కడి వేడి గురించి, సూర్యుడి గురించి ఆలోచించాల్సి వస్తోంది. ఈ తెల్లవాడికి మన చీకటి రహస్యాలన్నీ ఎలా తెలిశాయి? ఈ మంత్రాలన్నీ వాడి చెవిలో ఎవరు ఊదారూ? ఆ జర్మనీ అయన



మాక్సముల్లరా? సంస్కృతం నేర్చుకుని "మాక్సముల్లా భట్టారకుడు" అయి మా వేదాలు మాకే బోధిస్తున్నాడా?

భారతదేశంలో ఉండగా అన్నయ్య అమెరికా ఇంగ్లాండు, యూరోపుల గురించి ఎన్నో కలలు గన్నాడు. ఇక్కడ అమెరికాలో నేమో ఎక్కువగా మాతృదేశం గురించి చదువుతున్నాడు. దాని గురించే చర్చిస్తున్నాడు. కలిసిన మిత్రులందరికీ కాఫీ ఇప్పిస్తున్నాడు. వాళ్ళిచ్చే బీర్ తను తాగుతున్నాడు. జాతకం చెపుతానన్న మిషతో అమెరికా ఆడవాళ్ళ చేతులెన్నో తాకుతున్నాడు.

"భారతదేశంలో మీ ఆడవాళ్ళెందుకు నొసట ఎర్రని బొట్టు పెట్టుకుంటారు?" వంటి ఎన్నో ప్రశ్నలకు తకీమని సమాధానం చెప్పే పద్ధతిలో అతడు సిద్ధంగా ఉంటున్నాడు. అప్పుడప్పుడు భగవద్గీత శ్లోకాలు వల్లించి అన్వయిస్తూ ఉంటాడు. ఆపని మైసూర్లో తండ్రి చేయమన్నప్పుడు నసేమిరా అనేవాడు. విస్కీ తాగుతున్నాడు. బీఫ్ తింటున్నాడు. టాయ్‌లెట్‌కు వెళ్ళినపుడు కడుక్కోకుండా పేపర్‌తో తుడుచుకోవడం దాకా వచ్చేశాడు. ఎకనమిక్స్ పాఠ్య పుస్తకాలు చదువుతూ చదువుతూ 'ప్లేబోయ్' పత్రికలో ఎగిసిపడే వక్షోజాలు, నునుపైన తొడలనుండి దృష్టి మరల్చి, భారతీయ సంస్కృతి గురించి చదవడం మొదలు పెట్టాడు. భారతీయ సంస్కృతి గురించి తెలుసుకోవాలంటే ఎవరైనా సరే చికాగో లైబ్రరికి రావల్సిందేనని అందరితో చెబుతూ ఉన్నాడు.

ఆరోజు రాక్‌లో పుస్తకాలు తిరగేస్తూ వుంటే నీలిరంగు కవరుతో లావుపాటి పుస్తక మొకటి కనిపించింది. దాని వెన్నుమీద "హిందూయిజం: కస్టమ్ అండ్ రితువల్"- అని ఉంది. స్టీవెన్ ఫర్గూసన్ దాని రచయిత. అది అప్పుడే ప్రచురింపబడి, లైబ్రరికి కొత్తగా వచ్చినట్లుంది. గర్భధారణ, డోలాలోత్సవం, అన్నప్రాసన, వడుగు, వివాహం, మొదటి రాత్రి.... అన్నీ ఎంతో వివరంగా అధ్యాయాలుగా వివరించబడ్డాయి. అలా పేజీలు తిప్పుతూ ఉంటే నూట అరవై మూడో పేజీలో బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం చేసే చావు - అంత్యక్రియలు, పెద్దకర్మలకు సంబంధించిన విశేషాలు ఫొటోలతో సహా కనిపించాయి. అదంతా ఫర్గూసన్ ఇచ్చే సమాచార భాండాగారం. ప్రతిపేజీలో మనువు కొటేషన్లు తప్పనిసరిగా ఉన్నాయి.

పిత్ర-మేధ-సూత్ర : ఏది సేగు సంబంధం? ఏది కాదు? సర్వసంగ పరిత్యాగికి, పళ్ళురాని శిశువుకు అంటు అనేదే లేదు. శిశువు మరణిస్తే ఒకే ఒక రోజు మైల.... సృష్టి. పుట్టి వెంట్రుకలు తీసిన వాడైతే మూడు రోజులు. కర్మకాండ జరపడానికి ఏడుగురు అవసరమౌతారు. తండ్రి, తాత, ముత్తాత, ఆ మూడు తరాలకోసం ఇక్కడి మూడు తరాల వాళ్ళు అంటే కొడుకు, మనుమడు, ముని మనుమడు కలిపి కర్మ జరుపుతారు. మూడు తరాలు పైన, మూడు తరాలు కింద. చుట్టూ వున్న ఏడు పిండాల మధ్యన కేంద్రకంగా 'అహం' మధ్యలో ఉంటుంది.

...... ఇట్లాగే అనేక వివరాలు ఉన్నాయి. ఒకపేజీలో కులాన్ని బట్టి సృష్టి (అంటు, మైల) ఎవరికి ఎన్ని రోజులు ఉంటుందన్న విషయం కూడా ఒక పట్టికలో ఇచ్చారు. తెలియకుండా రక్త సంబంధీకుడు ఎక్కడో దూర ప్రదేశాలలో చనిపోతే సృష్టి ఉండదు. కాని,వార్త అందిన మరుక్షణమే అతణ్ణి సృష్టి చుట్టేస్తుంది. విషయాలు చదువుతున్న కొద్దీ అన్నయ్యకు ఉత్సుకత పెరుగుతోంది. చాలా శ్రద్ధగా చదవడం మొదలు పెట్టాడు.

చుట్టూవున్న పుస్తకాల మధ్య అన్నయ్యకు ఒక చిన్న టేబుల్-కుర్చీ ఉంది. అతని పరిశోధనకు సంబంధించి, రాత్రింబగళ్ళు కూర్చుని చదివేది అక్కడే. ఫర్గూసన్ పుస్తకం అక్కడే చదువుతున్నాడు.. ఆ పుస్తకంలో నాలుగు రకాల శ్రార్థకర్మల గురించి రాసి ఉంది. అతడెప్పుడూ ఎవరి అంత్యక్రియలూ చూసి ఎరగడు. ఏదో ఒకటి రెండు సార్లు మాత్రం రోడ్ల మీద... అలంకరించి ఊరేగింపుగా తీసుకుపోయే శవాల్ని చూశాడు అంతే. అంతకంటే అతనికి చావు గురించి ఏమీ తెలియదు. వాళ్ళ పెదనాన్న గారు పోయినపుడు అతను బొంబాయిలో ఉన్నాడు. అంతిమయాత్రకు అందుకోలేక పొయ్యాడు. నాన్నగారికి మధుమేహం. కానయితే డాక్టరు ఫరవాలేదన్నాడు. ఆహార పానీయాలు నియమానుసారం తీసుకుంటే ప్రాణానికి ప్రమాదం లేదన్నాడు. కాని అనుకోకుండా రెండేళ్ళ క్రితం గుండెపోటు వచ్చి, పక్షవాతానికి దారితీసింది. ముఖంలో ఎడమ భాగం కుంచించుకు పోయింది-అన్నయ్యకు తల్లి రాసే ఉత్తరాలలో ఈ విషయాలన్నీ తెలిసాయి. ఓసారి దమయంతి నీళ్ళు పోసుకున్న విషయం కూడా రాసింది. మరోసారి శనివారాలు తప్పకుండా తలంటుకోమని రాసింది. 'శికాకాయపొడి పంపించేదా?'-అని కూడా రాసిందోసారి. వణికే చేతిని అదుపులో పెట్టుకుని రాసినట్టుగా వుండేవి ఆ అక్షరాలు.

మనిషి చనిపోగానే అతణ్ణి పరుపుపైనుంచి తీసి, నేల మీద వరి గడ్డిలో కాళ్ళు దక్షిణం వైపు ఉంచి పడుకో బెడతారు. శరీరం భూమికి, స్వర్గానికి మధ్య వ్రేలాడుతున్నట్టు, నేలను కరుచుకుని కట్టెలా అయిపోవాలి. గడ్డి అంటే భూసారాన్నంతా పీల్చి, జీవితాన్ని అనుభవించి, రాలిపోయిన జీవం! దానికీ అగ్నికి దగ్గరి చుట్టరికం కూడా ఉంది. దక్షిణం యముడి ఇల్లు. పూర్వీకుల సామ్రాజ్యం.

కుడి చెవిలోవేదనాదాలు, నోటిలో ఆవు పంచోదకాలు, చనిపోయిన మనిషి శరీరం అంటై పోతూ ఉంటుంది. (కాని సజీవంగా ఉన్న ఆవుపేడ ఆ దేహాన్ని శుద్ధి చేస్తూ ఉంటుంది.. చూడండి విచిత్రం?) ఇకపోతే పదిరకాల చదివింపులు... నవ్వులు, గోవు, భూమి, నెయ్యి, స్వర్ణం, వెండి, ఉప్పు, గుడ్డ, ధాన్యం, చక్కెర! మనిషి చనిపోగానే అతని కొడుకులంతా స్నానం చేస్తారు. పెద్దవాడు అశుభ సూచకంగా జంధ్యాన్ని అపశ్రవ్యం చేసుకుంటాడు. శవానికి స్నానం చేయిస్తారు. బొట్లు పెడతారు. అలంకారాలు చేస్తారు. భూదేవిని పొగడుతూ మంత్రోచ్చారణ చేస్తారు.

ఈ వివరాలన్నీ వున్న పేజీకి ఎదురుగా గ్లాసీ పేపర్ మీద ఒక ఫొటోగ్రాఫ్ అచ్చేసి ఉంది. అది ముందు వసారా. ఆ ఇంటి కట్టడాన్ని బట్టి అది మైసూరుప్రాంతపుదని పోల్చుకోవచ్చు. వెనక పెద్ద కిటికీ, కింద వరండా. నేలమీద అలంకరించిన శవం-

మరణించిన వ్యక్తి భగవంతుడితో సమానం. అతడు విష్ణువు. చనిపోయిందిస్త్రీ అయితే ఆమె శ్రీ మహాలక్ష్మి భగవంతుడికి వలె ప్రదక్షణలు చేసి, హారతి పడతారు. శవం బొటనవ్రేళ్ళు తాడుతో కట్టి పై నుండి తెలగుడ్డ నిండుగా కప్పుతారు.

ఆ ఫొటో కూడా ఉంది. ఇది కూడా మైసూరు ప్రాంతపు ఇల్లే! ఫొటోలో విభూతి పూసుకున్న ఇద్దరు బ్రాహ్మణులు కనిపించారు. అన్నయకు వారిని ఎక్కడో చూసినట్లు అనిపించింది. విభూతి పూసుకున్న వాళ్ళంతా ఒకలాగే అనిపిస్తారులే-అని కూడా అనుకున్నాడు.

మరో ఫొటోలో అంతిమయాత్ర ప్రారంభమైంది. కర్రలతో కట్టిన పాడి మీద శవాన్ని పడుకోబెట్టారు. నలుగురు నాలుగు వైపులా భుజాల పైకి ఎత్తుకున్నారు..... ఈ వీధి కూడా తప్పకుండా మైసూర్‌లోదే. అన్నయ్య గుర్తు పట్టాడు. అతను చాలా సార్లు చూసిన వీధే!

ఊరేగింపు మూడు చోట్ల ఆగుతుంది. శవాన్ని కిందికి దింపి ప్రదక్షణలు చేస్తారు- 'దింపుడు గల్లం... ఆశ!' దుష్ట శక్తుల్ని ప్రసన్నం చేసుకోవడానికి ధాన్యం చల్లుతారు.

శ్మశానం చేరుకోగానే ముఖం దక్షిణం వైపు ఉంచి శవాన్ని చితి పైకి చేరుస్తారు. బొటన వేళ్ళు విప్పుతారు. పైన కప్పిన తెల్లగుడ్డ తీసి, కాటి కాపరికిస్తారు. కొడుకులు ఇతర రక్తసంబంధీకులు శవం నోట్లో తీర్థం పోస్తారు. ఒక బంగారు నాణెం పెడతారు. నడుము కింది భాగం అరటి ఆకుతో కప్పుతారు. లేదా చిన్న గుడ్డముక్క ఉంటుంది- తప్ప, ఇంకేమీ ఉండదు. పుట్టినప్పుడు ఉన్నట్లే నగ్నంగా ఉంటుంది.

హుం... విచిత్రం? ఈ రోజుల్లో వీళ్ళకింత బంగారు నాణాలు ఎక్కడ దొరుకుతున్నాయి? పద్నాలుగు కేరట్లది అయితే మాత్రం?.... ఇది వేదాలలో ఉందా?....

పెద్ద కొడుకు కొత్త కుండను నీటితో నింపి భుజం పై పట్టుకుంటాడు. రాయితో దానికి వెనకనుండి చిన్న రంధ్రం చేస్తారు. నీళ్ళు చిమ్ముతూ వుండగా అతను చితి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. మూడుసార్లు తిరిగాక కుండను వెనక్కి వదిలేస్తారు. అది దభీమని కూలి ముక్క చెక్కలవుతుంది.

ఎందుకోగాని అన్నయ్యకు ఆ ఫొటో చూస్తూ వుంటే ఎంతో బాధేసింది. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలున్న ఫొటో అది. అందులోని మనుషులంతా ఎక్కడో చూసిన వాళ్ళలాగా ఉన్నారు. చితి, శవం, బోడి గుండు చేయించుకున్న నడి వయసు మనిషి అతని భుజం మీది కుండ, అందులోంచి సన్నగా చిమ్ముతున్న నీటి అణువులు. దూరంగా వున్న చెట్లు, అస్పష్టంగా కనిపిస్తున్న చుట్టూ నిలబడ్డ మనుషులు.................

అరెరె, ఈ ముఖం ఇక్కడెందుకుంది? ఆ నడి వయసు మనిషి తన మామ సుందర్రావ్. అతనికి హన్సూర్ లో ఒక ఫొటో స్టూడియో కూడా ఉంది. ఈ శాల్తి ఇక్కడికెలా వచ్చింది? ఫొటో కింద 'మండుతున్న చితి' అనే శీర్షిక. దాని కింద మంత్రాలు....

ఓ అగ్నిదేవా! ఇతణ్ణి కాల్చకు. ఇతడి చర్మాన్ని కాల్చకు. ఏ నొప్పీ లేకుండా ఇతణ్ణి పుణ్యలోకాలకు తీసుకుపో! పూర్వీకుల్లో కలుపు ఓ అగ్నిదేవా! నువ్వు ఇతడి పవిత్రమైన మంటలో పుట్టావు. ఇప్పుడు మళ్ళీ ఇతణ్ణి నీలో పుట్టనీయ్.


అన్నయ్య మంత్రాలు చదివి అర్థం చేసుకున్నాడు. మళ్ళీ ఫొటోలో సుందర్రావ్ ముఖం వెతికాడు. ఎప్పుడూ కళ్ళకు వుండే అద్దాలు లేవు. తల, గడ్డం, అంతా అప్పుడప్పుడే నున్నగా గీసినట్లు ఉంది. ఛాతి మీద కూడా వెంట్రుకల్లేవ్. కండువా ఒకటి నడుముకు బిగించాడు. దాంతో పొట్టంతా పైకి ఎగతన్నింది... అసలు ఈయన ఇక్కడ ఎందుకున్నాడు? ఈ పుస్తకంలోకి ఎలా వచ్చాడు?


పుస్తకాన్ని వెనక్కి తిప్పి ముందు మాట చదివాడు. అందులో వున్నదాన్నిబట్టి ఫర్గూసన్ ఫోర్డ్ ఫౌండేషన్ గ్రాంటుతో ఒక సంవత్సరం పాటు మైసూర్‌లో ఉన్నాడు. అప్పుడు మైసూర్‌లోని సుందర్రావ్ అనే వ్యక్తి, అతని కుటుంబ సభ్యులూ ఈ పుస్తక రచనకు ఎంతో సహకరించారు. ఎన్నో విషయాలు చెప్పారు. మెటీరియల్ సమకూర్చారు. అందుకే ఫొటోలలో మైసూరు ఇళ్ళున్నాయన్న మాట! మళ్ళీ పుస్తకం వెనక్కితిప్పి, ఫొటోలు చూశాడు. ఆ ఎదురుగా పెద్ద కిటికీ గోపి వాళ్ళది. దూరంగా వున్న పెద్ద చింత చెట్టు గంగమ్మది కాదూ? దాని కిందే చిన్న గుడిసె! అవును ఇది తప్పకుండా తమ వీధే. ఈ వరండా తన ఇంటి వరండానే- మరి శవం? నాన్నగారిదా? సరిగా కనబడదే - శవం ముఖం నీళ్ళలోని ప్రతిబింబం లాగా అస్పష్టంగా ఉంది. శరీరమంతా తెల్లగుడ్డతో కప్పి ఉందయ్యె. చుట్టూ వున్న బ్రాహ్మణుల ముఖాలు బాగా తెలిసినవే. చాలా సార్లు చూసినవే.

పుస్తకం మళ్ళీ ముందుకు తిప్పి ముందు మాట చదివాడు .... సుందర్రావ్ ఎంతో సహాయ పడ్డాడు. అతడు తన బంధువుల ఇళ్ళల్లో జరిగిన పెళ్ళిళ్ళకు, వడుగులకు, డోలాలోత్సవాలకు, చావులకు అన్నింటికీ తీసుకెళ్ళాడు. ఫొటోలు తీయడంలోనూ, ఇంటర్వ్యూలు రికార్డు చేసుకోవడంలోనూ ఎంతో సహనంతో సహాయ పడ్డాడు. భోజన వసతులూ కల్పించాడు. ఈ 'మ్లేచ్ఛుడు' అతని రుణం తీర్చుకోలేడు-

-ఫర్గూసన్

అన్నయ్య మళ్ళీ చితి దగ్గరి ఫొటో తీశాడు. నిశితంగా పరిశీలించాడు. చితి మండుతోంది. శ్మశానం మైసూరులోదే. ఫొటోకింద ఫొటో కర్టసీ - సుందర్రావ్ ఫొటో స్టూడియో అని ఉంది. సందేహం లేదు. నాన్నగారు చనిపోయారు. తన మేనమామ అంత్యక్రియలు జరిపించాడు. కొడుకు విదేశాలలో ఉన్నాడు. అతడికి కబురు






పెట్టొద్దని తన తల్లే చెప్పి ఉంటుంది. "తండ్రి లేని పిల్లడు. ఒక్కడే అమెరికాలో ఉన్నాడు. వాడికి ఈ వార్త తెలియనీయకండి. చదువు మధ్యలో ఆపుకుని వాణ్ణి రానీయకండి. ఇప్పుడొచ్చి చేసేది మాత్రం ఏముంది? వాడి భవిష్యత్తు పాడుకావొద్దు."- అని!! లేదా... ఇది సుందర్రావ్ మామ ఆలోచనే అయి వుంటుంది. అమ్మ చెవిలో మెల్లగా ఊది ఉంటాడు. ఈ మంత్రం..... అంతే! ఆమె అన్నమాట జవదాటుతుందా? అన్నీ తెలిసిన వాడు. బాగా ఆలోచించి చెప్పేవాడు' - అని కదా ఆమె అభిప్రాయం? మరి అతని సలహా ఎలా కాదంటుంది?

క్షణాలు మీద అన్నయ్యకు ఉద్రేకం, దుఃఖం పొంగు కొచ్చింది. "మా నాన్న చనిపోతే మధ్యలో ఈ మామగాడు కొడుకునైన నాకు తెలియనివ్వలేదు. అమ్మనేం చేశాడో కదా? బోడిగుండు కొట్టించి, మూల కూర్చోబెట్టి ఉంటాడు.. పాపిష్టివాడు. గాడిద కొడుకు! దున్నపోతు!!" - అన్నయ్య మండుతున్న చితిని చూశాడు. పక్కనే సుందర్రావు బోడి గుండు, పెద్ద పొట్ట...... ఇంత పాటి బొట్టు - ఛీ!!!

అన్నయ్య మనసు చలించి పోయింది. మెదడు తిమ్మిరెక్కింది. పుస్తకం అటూఇటూ మెల్లగా తిప్పాడు. అది చేతిలోంచి జారి కింద పడింది. పుటలు మడతబడ్డాయి. ఆత్రంగా అందుకుని వాటిని సరిచేశాడు. గ్రంథాలయంలోని నిశ్శబ్దం, టాయ్‌లెట్ గది నీటి చప్పుడుతో బద్దలయ్యింది. ఎవరో ఫ్లష్ చేసి ఉంటారు. నీరు ఉధృతంగా పడి ఆగిన చప్పుడు. - మళ్ళా గ్రంథాలయ .... నిశ్శబ్దం!

'గర్భధారణ' - అనే అధ్యాయంలో పుటలు తిప్పి చూశాడు. సుందర్రావు మామ కూతురు దమయంతి సీతామహాలక్ష్మిలా పూల జడతో ముత్తయిదువుల మధ్యన రాణిలాగా కూర్చొని ఉంది. ఎత్తైన పొట్టతో ఏడు నెలల గర్భిణి అని తెలిసిపోతోంది. ఈ అమెరికా వాడితో సుందర్రావ్ 'శ్రీమంతం' గురించి చెప్పి ఉంటాడు. ఫొటోలు తీయించి ఉంటాడు.శుభకార్యం పెద్ద అట్టహాసంగా జరిపి ఉంటాడు. చావు, అంత్యక్రియలు, కర్మకాండ అంతా చూపెడతానని వాగ్దానం కూడా చేసి ఉంటాడు. ఆరోజుల్లోనే నాన్నగారి మరణం అతడికి ఉపయోగపడి ఉంటుంది.

ఈ సుందర్రావ్ అనే శాస్త్రీ ఫర్గూసన్ పాత్రధారి నుండి ఎంతైనా డబ్బు లాగివుంటాడు - ఆశ్చర్యం లేదు-

అందులో అమ్మముఖం కనిపిస్తుందేమో నని అన్నయ్య ఆ ఫొటో పరిశీలనగా చూశాడు. కాని, ఎక్కడా కనబడలేదు. చింత చెట్టు గంగమ్మ, అల్లికలు కుట్లూ కుట్టుకుని బతికే ఎదురింటి లక్ష్మమ్మ. అవే చామనఛాయ ముఖాలు, అవే ముక్కులు చెవులకు గంటీలు, పెద్ద పెద్ద ముక్కు పుడకలు, నొసట రూపాయి బిళ్ళంత గుండ్రని కుంకమ బొట్లు.

ఏం తోచిందో గాని, మళ్ళీ విషయ సూచిక తిప్పాడు. ఇంగ్లీషు అక్షరం 'యు' నుండి కిందికి దిగి 'వి'లోకి వచ్చాడు. వర్ష, వేదాస్, వెద్దాస్, విష్ణు, వ్యాస అలాగే అక్షర క్రమంలో 'డబ్ల్యు' కింద విడోస్ చూశాడు. విడోహుడ్ అనే అంశం మీదప్రత్యేకంగా ఒక అధ్యాయమే ఉంది. అది తీశాడు. పేజి 233లో ఒక మంచి ఫొటోగ్రాఫ్ ఉంది.

"హిందూ విధవరాలు! శైవ మతానుసారం తల వెంట్రుకలు తీయించ బడ్డాయి" - అనే వివరణ కూడా ఉంది. ఫొటో కర్టసీ: సుందర్రావ్ ఫొటో స్టూడియో, హన్సూర్ అని కూడా ఉంది.

"అమ్మ ఫొటోయేనా?" - అతడు గుర్తు పట్టలేకపొయ్యాడు. చిన్నప్పటి నుండి అమ్మను ఎప్పుడూ అలా చూడలేదు. తెలిసిన ముఖమే అయినా ఎవరి ముఖం లాగానే ఉంది. వెంట్రుకలు తీయించి ఉంటారు. బోడిగుండు కనబడకుండా అమ్మ కొంగుతో తల కప్పేసుకుంది. ఫొటో నలుపు - తెలుపుదే అయినా ఆమె కట్టుకున్న వెలిసిపోయిన ఎరుపు చీర రంగు - అన్నయ్య కళ్ళలో మెదిలింది!

అన్నయ్య పట్టలేనంత మనోవేదనకు గురయ్యాడు- ఆరోజు సుందర్రావ్ బతికి పొయ్యాడంటే - అన్నయ్యకు దూరంగా పసిఫిక్ మహాసముద్రం అవల, పదివేల మైళ్ళ దూరంలో మైసూర్‌లోని హన్సూర్‌లో చెలువాంబా అగ్రహారంలో ఉండిపొయ్యాడు గనక!

★

